# స్నేహబంధం

"అజయ్ లేవరా" అని అమ్మ కుదిపి లేపితేగాని నాకు తెలివి రాలేదు. కళ్ళు నులుముకుంటూ చూసాను. ఏడయింది. అమావాస్య రాత్రులు కావడంతో చాలా చీకటిగా ఉంది. సెలవులని బాబాయి ఇంటికి వెళ్ళి, వారం రోజులు ఎంజాయ్ చేసి మధ్యాహ్నమే వచ్చాను. అలసిపోయి ఉండడంతో అన్నం తినగానే నిద్రపట్టేసింది. ఆలోచిస్తూ బాత్రూమ్‌లోకి నడిచాను. మొఖం కడుక్కుని, ఫ్రెష్ అయి వచ్చిన నన్ను చూసి "అజయ్, తాతయ్య చనిపోయార్రా" అని అమ్మ అంది.

"ఏ తాతయ్య" ఆదుర్దాగా అడిగాను.

"రామారావు తాతయ్య"

ఒక్కసారి నా తల తిరిగిపోయింది. నిజమా అన్నట్లు అమ్మ వైపు చూసాను.

"అవునురా! ఇప్పుడే ఆరుగంటలకి.. హార్ట్ ఎటాక్ అంట" బాధగా అంది.

వెంటనే అక్కడికే పరిగెత్తాను. తాతయ్య వాళ్ళది మా వెనుక ఇల్లే. వాళ్ళ ఇంటిముందు చాలామంది ఉన్నారు. తాతయ్య శవం చుట్టూ ఆడ, మగపిల్లలు కూర్చుని ఏడుస్తున్నారు. నిశ్చలంగా నిద్రపోతున్నట్లు ఉన్నాడు తాతయ్య.

"అజయ్! బాగా అలిసిపోయావ్రా" అంటున్నట్లుంది తాతయ్య వదనం. కళ్ళనిండా నీరు నింపుకొని అలా ఎంతసేపు ఉన్నానో నాకే తెలియదు. కానీ నాన్న వచ్చి భుజం మీద చేయి వేసి "పదరా!" అన్నట్లు సౌంజ్ఞ చేసి ఇంటికి తీసుకు వచ్చారు. తాతయ్య పెద్దకొడుకు వూర్లో లేనందున ఆ రాత్రి ఉంచి, ఉదయమే శవదహనానికి ఏర్పాట్లు చేస్తారట. నాన్న, అమ్మతో చెపుతున్నారు. నా మదినిండా తాతయ్యే... తాతయ్య తలపులే.

తాతయ్యకు, నాకు పరిచయం చాలా చిత్రంగా జరిగింది. తాతయ్య వాళ్ళ ఇంటి వెనకే మేము కొత్తగా అద్దె ఇంట్లో దిగాము. ఇంట్లో దిగిన ఓ నెలరోజులకనుకుంటా, ఒకరోజు స్నానం చేస్తున్న నాకు భగవద్గీతలోని పద్యాల్ని పఠిస్తున్న మధురకంఠం విన్పించింది. ఆ కంఠం, ఆ పలికే తీరు చాలా బాగుంది. ఇంతవరకూ అలా ఎవరూ పాడగా నేను వినలేదు.

ఆరోజు అమ్మ ఏదో పని చెప్పడంతో వాళ్ళింటికి వెళ్ళాను. బయట కుర్చీలో ఆయన కూర్చున్నారు. పొడవుగా, చామనచాయ రంగులో, అక్కడక్కడా తెల్లబడిన వెంట్రుకలతో, దట్టమైన మీసాల్తో, తెల్లని పంచె కట్టులో చాలా దర్జాగా హుందాగా ఉన్నారు.

ఆయన్ని చూస్తూనే "ఉదయం పద్యాలు మీరే పాడారాండి" అడిగాన్నేను.

"అవును" అన్నారాయన.

"చాలా బాగుందండి"

"ఏమిటి? శ్లోకాలా?"

"కాదు. మీ కంఠం" అన్నాను.

నవ్వేసారాయన. "నీ పేరేమిటోయ్"

"అజయ్ అండీ"


"ఈ న్యూ జనరేషన్‌లో నా కంఠాన్ని మెచ్చిన మొదటివాడివి నువ్వే. అందుకే నీ పేరు కలకాలం గుర్తుంచుకుందామని"

నేను నవ్వకుండా ఉండలేకపోయాను. అలా జరిగింది మా పరిచయం.

ఆయన రోజూ సాయంత్రం బయటకు షికారుకు వెళ్ళేవారు. నేనూ రోజూ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడేవాడ్ని. ఓ రెండురోజులు ఫ్రెండ్స్ రానప్పుడు, షికారుకి వెళుతున్న తాతయ్య కన్పించారు. అలా టైమ్‌పాస్ చేద్దామని ఆయనతోపాటే షికారుకి వెళ్ళాను.

అదే నా జీవితంలో గొప్ప మలుపని, నన్ను ఎంతగానో మార్చివేస్తుందని కాని నేను ఊహించలేకపోయాను. ఆయనకు తెలియని విషయమే లేదా అన్పించేది ఆయనతో మాట్లాడుతున్నంతసేపూ. క్రమేపీ ఆట తగ్గించేసి, ఆయనతోనే వాహ్యాళికి వెళ్ళేవాడ్ని. ఆయన చెప్పే కబుర్లు ఎంతో ఆసక్తితో, ఆశ్చర్యంగా వినేవాడ్ని.

తాతయ్య పుట్టి పెరిగింది ఓ పల్లెటూర్లో. నేను పల్లెటూరు చూడకపోయినా తాతయ్య చెప్పేది వింటూ, ఆయన కళ్ళతోనే చూసాను. "మేము చిన్నప్పుడు పొలాల్లో, కాలవగట్ల పైన ఆడుకునేవాళ్ళం. కళ్ళ ముందే పైరు పెరిగి ఇంతింతై అలా ఎదిగిపోతుందిరా. అది పచ్చదనంలో ఉన్నప్పుడు చూడాలిరా. సముద్రంలో నీరు అలలుగా వస్తున్నట్లు గాలికి పైరంతా అలా, అలా కదులుతుంటే ఎంత గమ్మత్తుగా ఉంటుందో, ఎన్నిరోజులు చూసినా వింతగానే ఉండేది. పైరు నిండు చూలాలా.. వంగిపోయి కోతకి సిద్ధమైనప్పుడు ఆనందంతోపాటు విచారంగా కూడా ఉంటుందిరా. కోతలయ్యాక అంత భయంకర నిశ్శబ్దంగా ఉంటుంది. తర్వాత నాట్లు పడేవరకు మళ్ళా చూడలేము" అని ఆ ప్రకృతి దృశ్యాలన్నీ కళ్ళకు కట్టినట్లుగా చెప్పేవాడు.



తాతయ్య అయిదో తరగతి వరకే చదివారని తెలిసి ఆశ్చర్యపోయాను. అయిదో తరగతి చదివిన ఆయనకు కంప్యూటర్ పరిజ్ఞానం, భగవద్గీత చదవడం ఎలా సాధ్యమా? అనుకున్నాను. అదే అడిగేశాను కూడా.

దానికాయన "ఒరే! మా చదువులు ఎంతో అమూల్యమైనవి. విలువైనవీనూ. అప్పటి మా చదువుల్లో పట్టుదల, క్రమశిక్షణ ఉండేది. నేడది లోపించింది. అయినా నేను నిత్య విద్యార్థినే. నిత్యం చదువుతూనే ఉంటాను. కొత్త కొత్త విషయాలను తెలుసుకుంటూనే ఉంటాను. నా దృష్టిలో విద్యకు కొలమానం, డిగ్రీలు, పి.హెచ్.డిలు కాదు, అతని జ్ఞానం మాత్రమే." తాతయ్య మాటల్లోని సత్యాన్ని అంగీకరించక తప్పలేదు.

తాతయ్య కొడుకు ఇక్కడ స్థిరపడి ఉండిపోవడంతో, ఆయనకు ఆ పల్లెటూరిని వదిలి రాక తప్పలేదు. "అయితే, మళ్ళా మీ వూరుకి వెళ్ళలేదా" అని అడిగితే, "వెళ్ళానురా! ఈమధ్య ఇల్లు అమ్మకానికి పెట్టినప్పుడు వెళ్లాను. చాలా మారిపోయింది ఊరంతా. ఎక్కడ చూసినా ఏవేవో కట్టి పచ్చటి పందిరిలాంటి పల్లెని పాడుచేసారు. రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుల డేగకన్ను ఆ పల్లెలమీద పడింది. ఫలితం.. పండే భూముల్లో ప్లాట్లు, ఆధునికం కావాలనే తాపత్రయం ఎక్కువైపోయింది" నిట్టూర్చాడు.

"అక్కడక్కడా పాత జ్ఞాపకాలుగా మిగిలిపోయినవాటిని, మా ఇల్లుని, ఆఖరుసారిగా అపురూపంగా చూసుకున్నానురా" చాలా బాధపడుతూ చెప్పారు.

తాతయ్యతో అయిదునెలల స్నేహం నాలో ఎంతో మార్పు తెచ్చింది. నేను తాతయ్య పరిచయంతో చాలా మారిపోయాను.

ఒకరోజు "రోజూ భగవద్గీత చదువుతావు కదా! ఏమొస్తుంది తాతా!" కాస్త వెటకారంగా అడిగాను.

దానికాయన "తప్పురా! అలా అనకు. భగవద్గీత ఒక మహా గ్రంథం. జీవిత సత్యాలను తెలిపే ఆ శ్లోకాలు, అవి చదవడంలో వచ్చే ఆనందం నాకిష్టం. ఏ గ్రంథం దానికి సాటిరాదు. మీలోని ఎంతమంది దాన్ని చదవగలరు. ఎంత చదువు చదువుకున్నా అది చదివేటప్పుడు నోరు తిరగదు. అది మీ తప్పని అనలేను. అది మీరు నేర్చుకునే విద్య, మీపై ప్రభావం చూపించే ఈ సమాజందీనూ" అని వివరించాడు.

తాతయ్యకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు. అందరికీ పెళ్ళిళ్ళు అయిపోయాయి. కొడుకులిద్దరూ మంచి ఉద్యోగాలు చేస్తున్నారు. తాతయ్య భార్య చనిపోయి అయిదు సంవత్సరాలు అవుతుంది. ఒంటరిగా పల్లెటూర్లో ఎందుకు ఉండడం అని పిల్లలంతా బాగా ఒత్తిడి తెస్తే, తన కష్టార్జితమైన వ్యవసాయ భూములన్నీ అమ్ముకొని, వచ్చిన డబ్బంతా పిల్లలకి సమానంగా పంచేశారు. ఆఖరుగా ఊర్లో ఉన్న ఇల్లు కూడా ఆయనతో అమ్మించారు. ఇప్పుడు ఆయన దగ్గర ఏ ఆస్తీ లేదు. క్రమంగా కొడుకులు, కోడళ్ళ నిజ స్వరూపాలు బయట పడుతున్నాయి. విసుక్కోవడాలు, చీదరింపులు ఎక్కువయ్యాయి.

కాని ఈ విషయాలు ఏనాడు తాతయ్య నాతో చెప్పలేదు. అమ్మ ద్వారా తెలిసింది. "పాపం. తాతయ్య ఈ బాధలు భరించలేక మనోవ్యాధితో చచ్చిపోయారు. కనీసం చివరిచూపు కూడా చూడలేకపోయాను కదా!" తాతయ్యతో గడిపిన క్షణాలను నెమరువేసుకుంటూ ఎప్పటికో నిద్రలోకి జారాను.

ఉదయం లేచేసరికి తాతయ్య కర్మకాండలకి అంతా సిద్ధం చేస్తున్నారు. బయటికి వెళ్ళబోతున్న నేను, అమ్మ పిలుపుతో వెనుదిరిగాను.

"అజయ్! మర్చిపోయాను. రెండురోజుల క్రిందటే తాతయ్య వచ్చి నీకు ఇది ఇమ్మన్నార్రా!... పాపం.. రెండురోజులుగా వాళ్ళింట్లో ఆయన్ని ఎక్కడ ఉంచాలి అనే విషయం మీద తగువులు. ఆయన ఆస్తులు అందరూ పంచుకున్నారు. ఆయన భారమైపోయారు. ఈ మనస్తాపం వల్లే ఆయన పోయారు" నిట్టూర్చింది అమ్మ.

ఆ పేకెట్‌ని అపురూపంగా అందుకున్నాను. పేపర్ చుట్టి ఉంది. దాన్ని తీసాను. భగవద్గీత... తాతయ్య చేతుల్లో ఎప్పుడూ ఉండే భగవద్గీత. నన్ను, తాతయ్యను కలిపిన భగవద్గీత. దాన్ని చూడగానే నా కళ్ళలో నీళ్ళూరాయి. కళ్ళు మసకబారాయి. మొదటిపేజీలో చిన్న స్లిప్. దానిమీద కలిపిరాతలో ఓ నాలుగు వాక్యాలు రాసి ఉన్నాయి. కళ్ళు తుడుచుకుని చదివాను.

"నా ప్రియనేస్తం,

నా జీవితంలో నీ స్నేహం మధురమైనది. ఈ భగవద్గీత అందుకునే అర్హత నీకే ఉంది. చివరగా నాదో సలహా... నీవు బ్రతికి ఉన్నంతవరకూ ఇతరుల మీద ఆధారపడకు. నీ కన్నవాళ్ళని చులకనగా చూడకు.

ఇట్లు,

నీ తాతయ్య."

అది చదివి భోరుమని ఏడ్చాను. "నువ్వు చెప్పినట్లుగానే ఉంటాను తాతయ్య" మనసులో అనుకున్నాను.

తాతయ్యని కర్మకాండలకి తీసుకు వెళుతున్నారు. నేనూ వెంట బయలుదేరాను. ఒక్కసారి, ఒకే ఒక్కసారి తాతయ్య లేచి కూర్చుంటే ఎంత బాగుంటుంది. పిచ్చి ఆలోచన... ఇదే తాతయ్య వింటే పకపకా నవ్వేవాడు.

'జాతస్య హి ధ్రువో మృత్యుః
ధ్రువం జన్మ మృతస్య చ!'

'శరీరానికి మరణం ఉంది కాని ఆత్మకు లేదు' తాతయ్య చెప్పిన భగవద్గీతలోని వాక్యాలు గుర్తుకొచ్చాయి. 'అవును, ఆత్మకు మరణం లేదు. తాతయ్య మళ్ళీ ఇక్కడే, ఎక్కడో పుడతాడు. వెతుక్కోవాలి' అస్పష్టంగా గొణుక్కున్నాను.

-ఆర్.శ్యామల (బొబ్బిలి)